# మేడారంలో ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్ ప్రారంభం

- భక్తులు ఆర్టీసీ బస్సుల్లోనే రావాలి : పొన్నం
- మేడారంలో శాశ్వత బస్టాండ్ : సీతక్క



**విశ్వంభర, ములుగు :** మేడారం మహాజాతర -2026 కోసం ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రవాణా, మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నది. శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్ మేడారాన్ని సందర్శించి తాత్కాలిక ఆర్టీసీ బస్టాండును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మేడారం జాతరకు భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో 4,000 ఆర్టీసీ బస్సులను నడుపుతున్నామని చెప్పారు. అవసరాన్ని బట్టి మరిన్ని బస్సులు కూడా పెంచుతామని చెప్పారు. ఇందుకోసం రవాణాశాఖ తరపున వందలాది మంది అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా నియమించామని పొన్నం ప్రభాకర్ చెప్పారు.ప్రయాణ సేవలు జనవరి 20 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిరంతరంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రయాణికులకు రవాణా సేవలతోపాటు భద్రత, ఆరోగ్య సహాయం చేస్తామని చెప్పారు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సహా ఆర్టీసీ ఉన్నతాధికారులు జాతర విజయవంతానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. భక్తులు తమ ప్రయాణాన్ని సురక్షితంగా, సౌకర్యవంతంగా పూర్తి చేసుకోవాలంటే తప్పనిసరిగా ఆర్టీసీ బస్సులనే వినియోగించాలని మంతమంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు. సొంత వాహనాలతో వస్తే దూరంగా పార్కింగ్, ఎక్కువ నడక వంటి ఇబ్బందులు తప్పవని చెప్పారు. ఆర్టీసీ బస్సులు ప్రయాణికులను గద్దెలకు సమీపంలోనే దించుతాయని తెలిపారు.భక్తులంతా ఆర్టీసీ బస్సుల్లోనే రావాలని సూచించారు. జాతర సమయంలో చిన్న పిల్లలు తప్పిపోయే అవకాశం ఉండటంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చైల్డ్ ట్రాకింగ్ సిస్టమ్‌ను అమలు చేస్తున్నామని.. తల్లిదండ్రులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. పిల్లలు తప్పిపోతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

**శాశ్వత బస్టాండ్ ఏర్పాటు చేయాలి**

మంత్రి సీతక్క మాట్లాడుతూ 2024లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం జాతరకు రవాణా మౌలిక వసతులు కల్పించాలనే దూరదృష్టితో ముందడుగు వేశారని గుర్తు చేశారు. ప్రతి జాతర సమయంలో తాత్కాలిక ఏర్పాట్లతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, దీర్ఘకాలిక పరిష్కారంగా శాశ్వత ఆర్టీసీ బస్టాండ్‌ను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి ఏడాది జాతర సందర్భంగా అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. భక్తులు, ప్రయాణికులు ఎలాంటి అసౌకర్యాలు ఎదుర్కోకుండా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ములుగు జిల్లాలో సంవత్సరాల తరబడి బస్ డిపో లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, వెంటనే స్పందించి దాదాపు రూ.5 కోట్ల వ్యయంతో శాశ్వత బస్‌డిపోను మంజూరు చేసినందుకు రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మంత్రి సీతక్క ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఈడీవో ముని శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్ క్రీడా పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా ఉపాధ్యక్షురాలు సంకరమద్ది శ్రావ్య సుధీర్ రెడ్డి**



**విశ్వంభర, సూర్యాపేట :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న 'సీఎం కప్2026 క్రీడా పోటీలను జిల్లాలోని యువత పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షురాలు సంకరమద్ది శ్రావ్య సుధీర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారని, గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా గ్రామీణ క్రీడాకారులకు ప్రాధాన్యతనిస్తూ ఈ పోటీలను అట్టహాసంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. సీఎం రేవంత్ రెడ్డి దార్శనికత వల్లే నేడు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఐదు అంచెలలో పారదర్శకంగా పోటీలు జరుగుతున్నాయని, యువత పట్ల ఆయనకున్న అపారమైన నమ్మకానికి ఇది ఒక నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యంగా క్రీడాకారుల ఆర్థిక భరోసా కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీ నగదు బహుమతులను ప్రకటించడం విశేషమని, ఇది పేద క్రీడాకారులకు కొండంత అండగా నిలుస్తుందని తెలిపారు. 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా రాష్ట్రంలో 'యువ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేస్తూ, తెలంగాణ బిడ్డలు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలనే సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని తెలియజేశారు. స్వతహాగా క్రీడాకారుడు సీఎంగా ఉండటం ఎంతో సంతోషకరమని అటువంటి డైనమిక్ నాయకత్వంలో రాష్ట్రం క్రీడా హబ్‌గా మారుతుండన్న అశాభావాన్ని వ్యక్తం చేశారు. అదేవిధంగా సూర్యాపేట నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాటలో నడుస్తూ యువతలో క్రీడా స్ఫూర్తిని రగిలించేందుకు ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి లు క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహిస్తున్నట్లు గుర్తు చేశారు. జిల్లా క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లా కీర్తిని రాష్ట్ర స్థాయిలో చాటాలని ఆకాంక్షించారు.

## వ్యక్తిగతంగా మంచి మిత్రుని కోల్పోయాం

**- కాచం సత్యనారాయణ**



**విశ్వంభర, ఎల్బీనగర్ :** బీజేపీ తెలంగాణ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి(55) మరణం చాలా బాధాకరమని, వ్యక్తిగతంగా మంచి మిత్రుని కోల్పోయానని వీ3 ఛానెల్, విశ్వంభర దినపత్రిక చైర్మన్ డా. కాచం సత్యనారాయణ తెలిపారు. మధుసూదన్ రెడ్డి దైవభక్తి మెండుగా ఉన్న వ్యక్తి అని, ప్రజల కోసం పరితపించే నాయకుడు అని కాచం సత్యనారాయణ అన్నారు. ఆయన లేరన్న విషయం హృదయం కలిచి వేస్తుందని, ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నా. వారి కుటుంబ సభ్యులకు, సన్నిహితులకు, స్నేహితులకు ఈ కఠిన సమయంలో దేవుడు ధైర్యం ఇవ్వాలని కోరుకుంటున్నానని కాచం సత్యనారాయణ తెలిపారు.

## పటేల్ నగర్‌లో సీసీ రోడ్డు పనుల ప్రారంభం



**విశ్వంభర, అంబర్‌పేట :** అంబర్‌పేట డివిజన్ పటేల్ నగర్‌లో రూ.37 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్‌లోని ప్రతి బస్తీ అభివృద్ధికి కృషి చేస్తామని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీహార్ మాజీ సీఎం కర్పూరి ఠాకూర్ జయంతి



**విశ్వంభర, చైతన్యపురి :** చైతన్యపురి సాయి నగర్ శివాజీ ఆర్చ్ వద్ద బీహార్ మాజీ ముఖ్యమంత్రి , ఉచిత విద్య విధానం అమలుపరిచిన ప్రజా నాయకుడు కర్పూరి ఠాకూర్ 102వ జయంతి కార్యక్రమం ను క్షౌరవృత్తిదారుల సంగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నారం మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గంధం మనోహర్, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు కదారి రాములు, అంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గడ్డిఅన్నారం డివిజన్లో లక్ష్మీ మేడమ్ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాంరెడ్డి, సుధాకర్ రెడ్డి, నవీన్, ఓంకార్, రాజేష్ జైస్వాల్, నవీన్, సుజాత, శిరీష్, స్వాతి, బాలచందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు లాభదాయక వ్యవసాయం దిశగా అధికారుల సమన్వయ ప్రయత్నం అవసరం




**విశ్వంభర, హైదరాబాద్ :** రైతులకు లాభదాయక వ్యవసాయం దిశగా అధికారుల సమన్వయ ప్రయత్నం అవసరం అని తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే కోదండ రెడ్డి,, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి అన్నారు. కేంద్రంలో తెలంగాణ విశ్రాంత వ్యవసాయ అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ బి. కృపాకర్ రెడ్డి, గోపాల్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి ,తెలంగాణ వ్యవసాయ విశ్రాంత అధికారుల సంఘం ప్రెసిడెంట్ రంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి , కోదండ రెడ్డి మాట్లాడుతూ. రైతు లాభపడితేనే రాష్ట్రం బలపడుతుంది. వ్యవసాయాన్ని ఆధునిక సాంకేతికతతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించేలా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. సాయిల్ అనాలసిస్ ఆధారంగా పంటల ఎంపిక ఎరువుల వినియోగం జరిగితే రైతుకు పెట్టుబడి తగ్గి లాభం పెరుగుతుంది అని అన్నారు. నాణ్యమైన విత్తనాలు ప్రభుత్వమే సమకూర్చి పంపిణీ చేస్తే రైతులు మోసపోవడం ఆగుతుంది. పంట మార్పిడి, మైక్రో న్యూట్రియెంట్స్ వాడకం, నీటి పొదుపు పద్ధతులు రైతుకు భవిష్యత్తు చూపిస్తాయి అని పేర్కొన్నారు.రిటైర్ అయినప్పటికీ వ్యవసాయ అధికారులుగా పనిచేసిన అనుభవాన్ని వ్యవసాయ విశ్రాంత అధికారులు ఇంకా వ్యవసాయం పట్ల మక్కువ తో రైతుల అభ్యున్నతికి పనిచేస్తుండడం అభినందనీయం అని, రైతు రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధికై వ్యవసాయ విశ్రాంత అధికారులు సమర్పించిన నివేదికపై ముఖ్యమంత్రి తో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని తెలియజేశారు. తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ కృపాకర్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ విశ్రాంతి అధికారులు రిటైర్ అయినప్పటికీ సర్వీస్ లో ఉన్న వ్యవసాయ అధికారులు మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు పట్ల శ్రద్ధ చూపిస్తూ వారి నైపుణ్యాల ని పెంచుటకై అనేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. అదేవిధంగా విశ్రాంత వ్యవసాయ అధికారులు రైతుల బాగు కై ప్రభుత్వానికి సమయానుగుణంగా తగు నివేదికలు సమర్పిస్తున్నారని తెలిపారు.

## కంటోన్మెంట్ విలీనానికి 'పొన్నం' మద్దతు


- కేంద్రానికి రాసిన లేఖలో కీలక డిమాండ్
- ఎమ్మెల్యే శ్రీ గణేష్ దీక్షకు సంఘీభావం
- వివక్ష వీడాలని కేంద్ర మంత్రులకు విజ్ఞప్తి



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డును జీహెచ్ఎంసీలో విలీనం చేయాలన్న డిమాండ్ ఇప్పుడు మరింత ఊపందుకుంది. ఈ విలీనం కోసం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ చేపట్టిన దీక్షకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పూర్తి మద్దతు ప్రకటించారు. శనివారం ఈ మేరకు ఆయన ఒక అధికారిక ప్రకటన విడుదల చేస్తూ, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. కంటోన్మెంట్ ప్రజల చిరకాల వాంఛ అయిన విలీన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్రంలోని ముగ్గురు కీలక నేతలకు లేఖలు రాశారు. కంటోన్మెంట్ విలీనానికి సంబంధించిన తుది నిర్ణయాన్ని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ వెంటనే తీసుకోవాలని లేఖలో కోరారు. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్.. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఈ విషయంలో చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కంటోన్మెంట్ ప్రాంతం నగరం నడిబొడ్డున ఉన్నప్పటికీ, పాలనాపరమైన నిబంధనల వల్ల అభివృద్ధిలో వెనుకబడిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. కంటోన్మెంట్ పేరుతో సామాన్య ప్రజలపై జరుగుతున్న వివక్ష ఆగాలని తెలిపారు. జీహెచ్ఎంసీతో సమానంగా ఇక్కడ కూడా అభివృద్ధి జరగాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలు తీరాలంటే విలీనం ఒక్కటే మార్గమన్నారు. ఎమ్మెల్యే శ్రీ గణేష్ చేస్తున్న న్యాయమైన పోరాటానికి మా ప్రభుత్వం తరపున పూర్తి మద్దతు ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

ఇటీవల కేంద్ర రక్షణ శాఖ కంటోన్మెంట్ బోర్డు సభ్యుల పదవీకాలాన్ని మరో ఏడాది పొడిగిస్తూ గెజిట్ విడుదల చేయడంతో విలీన ప్రక్రియ జాప్యం అవుతోందని స్థానికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే శ్రీ గణేష్ 'ఆత్మగౌరవ దీక్ష' చేపట్టారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తాజా ప్రకటనతో ఈ అంశం ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మరో రాజకీయ చర్చకు దారితీసింది.

## నల్లమలలో మావోయిస్టులకు బిగ్ షాక్



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాలను పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్న ఆ పార్టీకి పోలీసులు షాక్ ఇచ్చారు. మావోయిస్టు పార్టీలో అత్యంత కీలకమైన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్, మిలటరీ ఇన్‌స్ట్రక్టర్ మీసాల సాల్మన్ అలియాస్ సంతోశ్ తో పాటు ఆయన భార్య, మరో ముగ్గురు అనుబంధ సంస్థల నేతలను నాగర్ కర్నూల్ పోలీసులు అరెస్టు చేశారు.

మన్ననూరు నుంచి అచ్చంపేటకు ఎర్టిగా కారులో మావోయిస్టు నేతలు వస్తున్నారన్న పక్కా సమాచారంతో సీఐ ఏ.నాగరాజు బృందం మాటు వేసింది. శనివారం ఉదయం 11:30 గంటల ప్రాంతంలో వారిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో సాల్మన్, ఆయన సతీమణి సంబట్టిని, తెలంగాణ ప్రజాఫ్రంట్ కోకన్వీనర్ ఎడ్ల అంబయ్య, సివిల్ లిబర్టీస్ కమిటీ నేత జక్కు బాలయ్య, మంశెట్టి యాదయ్య ఉన్నారు. వారి నుంచి రూ. 1.50 లక్షల నగదు, 5 జిలెటిన్ స్టిక్స్, 10 ఏకే 47 బుల్లెట్లు, 10 లైవ్ రౌండ్ల తూటాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**ఎవరీ సాల్మన్? 200 మందికి గెరిల్లా వార్ శిక్షణ**

గుంటూరు జిల్లా బొల్లపల్లికి చెందిన సాల్మన్ 1994లో ఉద్యమబాట పట్టారు. మావోయిస్టు పార్టీలో అత్యున్నత కేడర్‌లో ఉన్న ఈయనపై ప్రభుత్వం రూ. 20 లక్షల రివార్డు ప్రకటించింది. మోస్ట్ వాంటెడ్ నేతలు తిప్పిరి తిరుపతి, హిడ్మాల ఆదేశాల మేరకు ఈయన పని చేసేవారు. ఇప్పటి వరకు వేలాది మంది మావోయిస్టు కేడర్లకు, సుమారు 200 మంది పీఎల్‌జీఏ సభ్యులకు గెరిల్లా యుద్ధ తంత్రాల్లో శిక్షణ ఇచ్చారు.

**వందలాది పోలీసుల ప్రాణాలు తీసిన దాడుల్లో పాత్ర**

సాల్మన్‌పై మొత్తం 64 కేసులు నమోదయ్యాయి. ఛత్తీస్‌గఢ్, ఏపీ, తెలంగాణలో జరిగిన అతిపెద్ద దాడుల్లో ఈయన కీలక సూత్రధారిగా పోలీసులు గుర్తించారు. 1999లో రేమిడిచెర్ల వద్ద ల్యాండ్ మైన్ పేలుడులో 10 మంది పోలీసులు మృతి చెందారు. 2014లో కసన్సల్పాడ్ దాడిలో 14 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్ల మృతి చెందారు. 2021లో జొన్నగూడెం ఎటాక్ లో 22 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు మరణించారు. నల్లమల అడవుల్లో తిరిగి నెట్‌వర్క్ పెంచుకోవాలన్న మావోయిస్టుల ప్లాన్‌ను పోలీసులు ముందే పసిగట్టి భగ్నం చేశారు. సాల్మన్ అరెస్టుతో మావోయిస్టు మిలిటరీ కేడర్‌కు పెద్ద దెబ్బ తగిలిందని అధికారులు విశ్లేషిస్తున్నారు.



## చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి ఆకస్మిక మృతి

**విశ్వంభర, చంపాపేట్ :** ఎల్బీ నగర్ నియోజకవర్గము చంపాపేట్ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి ఆకస్మికంగా మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైటెక్ సిటీలోని స్టార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి వార్త తెలియగానే చంపాపేట్ డివిజన్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రజాసేవలో ఎప్పుడూ ముందుండే నాయకుడిగా గుర్తింపు పొందిన మధుసూదన్ రెడ్డి, డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారు. స్థానిక సమస్యలపై చురుకుగా స్పందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా ఆయనకు మంచి పేరు ఉంది. వంగ మధుసూదన్ రెడ్డి అకాల మరణం పార్టీకి తీరని లోటుగా మారిందని, చంపాపేట్ ప్రజల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆయన భౌతిక దేహాన్ని ప్రజల దర్శనార్థం కర్మన్ ఘాట్ కు తరలించనున్నట్లు కుటుంబ వర్గాలు తెలిపాయి. మధుసూదన్ రెడ్డి కుటుంబ సభ్యులకు పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, స్థానికులు సంతాపం తెలియజేస్తున్నారు.

## ఘనంగా జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు




**విశ్వంభర, ఎల్బీనగర్ :** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా దిల్ సుఖ్ నగర్ లోని హైదరాబాద్ 2 డిపోలో ప్రమాద రహితంగా బస్సులు నడిపే ఉత్తమ డ్రైవర్స్ ను ఘనంగా సన్మానించారు. దిల్ షుఖ్ నగర్ హైదరాబాద్ 2 డిపోలో జరిగిన రోడ్ భద్రతా మాసోత్సవాల కార్యక్రమంలో ఆర్ టీ సి హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్,హైదరాబాద్ జోన్ ఈ డి ఖుస్రోశ ఖాన్, హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు, రంగారెడ్డి జిల్లా ఆర్ ఎం శ్రీలత లు ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా 28 సంవత్సరాలు బస్సులు నడుపుతూ ఒక్కసారి కూడా యాక్సిడెంట్ కు గురికాకుండా ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చుతున్న ఉత్తమ డ్రైవర్లను కుటుంబ సభ్యులతో కలిపి ఘనంగా సన్మానించారు. వారికి ప్రోత్సాహకాలు ,బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ఆర్ ఎం సుగుణాకర్, సరస్వతి,డి ఎం సమత, మలక్ పేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ,డ్రైవర్లు,ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొడుకును కాపాడబోయి.. బావిలో పడి తండ్రీకొడుకులు మృతి

**విశ్వంభర, మహబూబాబాద్ :** జిల్లాలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. రెండేళ్ల చిన్నారిని కాపాడేందుకు ప్రయత్నించిన తండ్రి కూడా ప్రాణాలు కోల్పోవడంతో తండా మొత్తం విషాదంలో మునిగిపోయింది. మహబూబాబాద్ మండలం బలరాం తండాలో వ్యవసాయ బావి వద్దకు వెళ్లిన కేలోత్ మదన్ (40), అతని రెండేళ్ల కుమారుడు జస్వంత్ ప్రమాదవశాత్తు బావిలో జారి పడిపోయాడు. ఈ ఘటనను గమనించిన తండ్రి మదన్, ఏమాత్రం ఆలస్యం చేయకుండా కుమారుడిని కాపాడేందుకు బావిలోకి దూకాడు. అయితే, లోతైన బావి కావడంతో ఇద్దరూ బయటకు రాలేకపోయారు. సమాచారం అందుకున్న తండావాసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్ర ప్రయత్నాల అనంతరం తండ్రి మదన్ మృతదేహాన్ని బయటకు తీశారు. అయితే, బాలుడు జస్వంత్ మృతదేహం కోసం బావిలో ఇంకా గాలింపు కొనసాగుతోంది.ఈ ఘటనతో బలరాం తండాలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఒక్కసారిగా తండ్రీకొడుకులు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కన్నీటి పర్యంతమయ్యారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

